క్లుప్తంగా

మాలల గర్జన విజయవంతానికి పిలుపు

మునగపాక: వచ్చే నెల 8న విశాఖలో జరగనున్న మాలల గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీలా అప్పలనాయుడు, దిమ్మల నూకరాజు, బీలా శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


అయ్యప్ప పడిపూజలో స్వాములు

యలమంచిలి రూరల్: యలమంచిలి కొత్తపేట అయ్యప్పస్వామి ఆలయం 24వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా అయ్యప్ప మాలధారులు ఈ పూజలో పాల్గొన్నారు. గురుస్వామి గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అయ్యప్ప మాలధారులు పేటతుళ్లి ఆడారు. అనంతరం అయ్యప్ప స్వాములకు ఆలయంలో భిక్ష ఏర్పాటు చేశారు.

వైజ్ఞానిక యాత్రలతో మెదడుకు పదును


మాకవరపాలెం అవంతి ఇంజినీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులు

కోటవురట్ల: విద్యార్థి దశలో వైజ్ఞానిక యాత్రలు మెదడుకు పదును పెడతాయని ఇన్‌చార్జి హెచ్‌ఎం నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం వైజ్ఞానిక యాత్ర చేశారు. ఇందులో భాగంగా మాకవరపాలెంలో ఉన్న అవంతి ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన విద్యార్థులు అక్కడి అంశాలను నిశితంగా పరిశీలించారు. ఐటీ ట్రైనర్ శ్రీను, పీఈటీ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పఠనంతోనే ఉత్తమ ఫలితాలు


విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరీక్షిస్తున్న ఎంఈవో రామారావు

కోటవురట్ల: విద్యార్థులతో పదాలు పలికించడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎంఈవో రామారావు అన్నారు. స్థానిక గొల్లపేట ఎంపీపీ స్కూల్‌ను ఎంఈవో రామారావు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించారు. వారితో ఇంగ్లీషు పదాలు చదివించి ఎక్కువగా విద్యార్థులతో పఠనం చేయించాలని సూచించారు. హెచ్‌ఎం జీవన్, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోనే కాన్పులు జరగాలి


గంధవరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీపీవో

చోడవరం రూరల్ : గ్రామాల్లోని ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే జరిగేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని జిల్లా ఆరోగ్య అధికారి ల్యూసీకార్డీలియా సూచించారు. మంగళవారం గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గంధవరం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. బృందానికి నాయకత్వం వహించిన లూసీ కార్డీలియా సిబ్బందిని ఉద్దేశించి గర్భిణులు, బాలింతలలో రక్తహీనత సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందచేయాలని ఆదేశించారు. గవరవరం ఎంపీహెచ్‌ఓ రవి, హెచ్‌వీ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలక్ష్మి, ఏఎన్‌ఎం చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.


కోత దశలో ఉన్న వరి చేలు

అన్నదాత.. గుండెకోత


యండపల్లిలో కోతలు పూర్తవడంతో మడిలో ఉన్న వరి పనలు

రైతులను కల్లోలపరుస్తున్న అల్పపీడనం అలజడి ■ ప్రస్తుతం కోతలు వద్దు అంటున్న వ్యవసాయ అధికారులు ■ దిక్కుతోచని స్థితిలో కర్షకులు

కోటవురట్ల: ఆరుగాలం శ్రమించే అన్నదాతకు కష్టాలు వెన్నంటే ఉంటాయి.. నేడో రేపో పంట అందొచ్చే సమయంలో కూడా ప్రకృతి వైపరీత్యాలు పరుగులు పెట్టిస్తూనే ఉంటాయి.. పెట్టుబడి పెట్టి విత్తు నాటి ఫలసాయాన్ని పొందే చివరి క్షణాల్లో ప్రకృతి పెట్టే పరీక్షలో రైతు పాసో, ఫెయిలో కాలమే చెప్పాలి. ప్రస్తుతం అన్నదాతకు అదే పరీక్షా కాలం వచ్చేసింది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు అన్నదాత గుండెల్లో తుపాను రేపుతున్నాయి. సరిగ్గా కోతలు మొదలెట్టే సమయంలో తుపాను హెచ్చరికలు కలవరపెడుతున్నాయి. వరి చేలు కోత కోస్తే తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. మరో పక్క కోత కోయకుండా ఎక్కువ కాలం ఉన్నా గింజ రాలిపోయే పరిస్థితి ఉంది. ఎలాగైనా రైతుకు నష్టం తప్పేట్టు లేదు. కానీ అది ఏ **మోతాదులో ఉంటుందో రైతు అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అనుకూల వాతావరణంతో గతంలో కంటే అత్యధికంగా వరి సాగు జరిగింది. మండలంలో సుమారు 4,409 ఎకరాలలో వరి పంట సాగులో ఉంది. వరిచే**లన్నీ తెగుళ్లు, భారీ వర్షాలను దాటుకుని ప్రస్తుతం కోత దశకు చేరుకున్నాయి. హమ్మయ్య పంటను ఇంటికి చేర్చుకోవచ్చని ఊపిరి పీల్చుకున్న తరుణంలో ప్రస్తుత వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభం అయ్యాయి. మడిలో పనలుండగా వర్షాలు పడితే తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడనం గండం గట్టెక్కేంత వరకు ఆగితే గింజలు రాలిపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. అన్నవరం, యండపల్లి, జల్లూరు, పాములవాక, కోటవురట్ల, కైలాసపట్నం, రాజుపేట, లింగాపురం, చౌడువాడ, గొట్టివాడ, రామచంద్రపురం, కొడవటిపూడి, పి.కె.పల్లి, చినబొడ్డేపల్లి తదితర ప్రాంతాలలో కొందరు రైతులు వరి కోతలు పూర్తి చేశారు. అటూ ఇటూ కాని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతుండగా వ్యవసాయాధికారులు మాత్రం తాత్కాలికంగా వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు. పరిస్థితులు చక్కబడేంత వరకు కోతల జోలికి పోవద్దని సూచిస్తున్నారు.

ఏం చేయాలో దిక్కు తోచడంలేదు..



అల్పపీడన ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో తెలియదు. వరి చేలు కోతకు చేరుకున్నాయి. ఇపుడు కోయకపోతే గింజలు రాలిపోతాయి. కోస్తే వర్షాలకు పనలు తడిసి పాడవుతాయి. ఎలాగైనా నష్టమే. ఈ గండం గట్టెక్కే వరకు టెన్షన్ తప్పదు.

– గొర్ల నానిబాబు, రైతు, యండపల్లి

కోత దశలో ఏమిటీ కష్టం?



సరిగ్గా వరి చేలు కోత దశలో టెన్షన్ మొదలైంది. ఈ ఏడాది పరిస్థితులు బాగుండడంతో అత్యధికంగా సాగు చేశాం. ప్రస్తుతం కోతకు వచ్చేశాయి. తుపాను హెచ్చరికలతో కోతలను వాయిదా వేయాలంటున్నారు. అలాగైనా గింజ రాలిపోయేలా ఉంది.

–లోకవరపు బాబులు, రైతు, పి.కె.పల్లి

కోతలు వాయిదా వేసుకోండి..

వాతావరణ శాఖ చేసిన తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రస్తుతం వరి కోతలను వేయిదా వేసుకోవాలి. తుపాను ప్రభావం తగ్గాక కోతలు మొదలెట్టాలి. ఇప్పటికే కోతలు జరిగి ఉంటే పనలను వెంటనే కుప్పలు వేసుకుని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

–బి.సరోజిని, మండల వ్యవసాయ అధికారి

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

మునగపాక: వరి సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త సరిత కోరారు. మంగళవారం ఆమె మునగపాకలోని పేటకట్టు రైతు సంఘ పరిధిలోని వరి పైర్లను పరిశీలించారు. వరి ఆఖరిలో తెగుళ్ల బెడద ఉన్నట్లు గుర్తించామన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. మానిపండు తెగులు నివారణకు గాను లీటరు నీటిలో ఒక ఎంఎల్ ప్రాఫికొనజాల్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారులు విజేత, జ్యోత్స్నకుమారి, వీఏఏ సింధూజ, రైతులు టెక్కలి సూరప్పారావు, బొడ్డేడ సీతారామరాజు, భీశెట్టి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెల్లు రాల్చు పురుగు పట్ల అప్రమత్తం

కోటవురట్ల: వరిలో రెల్లు రాల్చు పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని బీసీటీ సైంటిస్టు ప్రసాద్ సూచించారు. మండలంలోని యండపల్లి, అన్నవరం గ్రామాల్లోమంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో గింజ గట్టిపడే దశలో రెల్లు రాల్చే పురుగు ఆశిస్తుందని తెలిపారు. ఇది రాత్రి పూట వెన్నులు కొరికి నష్టాన్ని కలగజేస్తుందన్నారు. దీని నివారణకు ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 60 ఎంఎల్ కోరాజెన్ లేదా 80 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును కలిపి పంట తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. పంటల బీమా పథకం దరఖాస్తుకు డిసెంబర్ 15వ తేదీ ఆఖరని, రైతులు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సరోజిని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విపత్తుల్లో అప్రమత్తం


డెమో నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

నక్కపల్లి: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించి సహాయక చర్యలు నిర్వహించాలని జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) 10వ బెటాలియన్ కమాండర్ వై. సత్యనారాయణ తెలిపారు. రాజయ్యపేట తుపాను రక్షిత భవనంలో మత్స్యకారులకు విపత్తుల నుండి కాపాడుకునే అంశంపై అవగాహన కల్పించారు. ఈనెల 11 నుంచి 27 వరకు కోస్తా తీర మండలాల్లో గల గ్రామాలు, పాఠశాలలు, పరిశ్రమల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తుపాన్లు, వరదలు, సునామీ, ఉరుములు, మెరుపు, దుమ్ము, వడగండ్లు, కుంభవృష్టి, బలమైన ఈదురు గాలుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డెమోను విద్యార్థులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు. తహసీల్దార్ ఆర్. నర్సింహమూర్తి, ఆర్‌ఐ కన్నబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను నేపథ్యంలో వరి కోతలు వద్దు


రాంబిల్లి మండల రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రాంబిల్లి (యలమంచిలి): తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని రాంబిల్లి వ్యవసాయాధికారి సీహెచ్ సుమంత కోరారు. హరిపురం, గొరపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల గురించి, చీడపీడల నుంచి ఎలా సంరక్షించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

మునగపాక: వాతావరణంలో మార్పుల కారణంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎక్కడైనా వరి కోతలు ప్రారంభిస్తే వాటిని సంరక్షించుకోవాలన్నారు. తుపాను ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీమా చెక్కు అందజేత


లబ్ధిదారునికి చెక్కు అందిస్తున్న బీఎం ఓబులునాయుడు

కోటవురట్ల: ఏపీ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ ఓబులునాయుడు కోరారు. పాములవాక ఏపీజీవీబీ బ్రాంచ్ పరిధిలో పీఎంజేజేబీవై బీమా చెక్కును మంగళవారం లబ్ధిదారునికి అందించారు. ఏపీజీవీబీ ఖాతాదారు అయిన నాతవరం మండలం చెర్లోపాలేనికి చెందిన డ్వాక్రా సభ్యురాలు గంటాడ వెంకటలక్ష్మి అనారోగ్యానికి గురై మృతి చెందడంతో ఆమెకు చెందిన బీమా పరిహారాన్ని ఆమె భర్త పెదలవకుసులుకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, క్యాషియర్ సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కారాదు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం: యువత డ్రగ్స్‌కి బానిస కాకుండా దూరంగా ఉండాలని అడ్డురోడ్డు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. అడ్డురోడ్డులోని శ్రీ ప్రజ్ఞా జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలో చేయాల్సిన మంచి పనులు, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు డ్రగ్స్ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, ఎస్.రాయవరం పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం స్ఫూర్తితో అందరికీ సమన్యాయం


శ్రీ ప్రకాష్ విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడ్వకేట్ మధురా గ్రేస్


నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ రత్నం


ధర్మవరం అగ్రహారం పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు


మునగపాకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, ఎంపీడీవో ఉషారాణి

పాయకరావుపేట: రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని అడ్వకేట్ జీ.పీ.మధురా గ్రేస్ అన్నారు. స్పెసెస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికీ అందించే ఉద్దేశ్యంతో రూపొందించబడిన రాజ్యాంగ ముసాయిదా ప్రతుల తొలి సంతకాల రోజైన నవంబర్ 26ను జాతీయ రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటారని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి..

మునగపాక: మునగపాక మండల పరిషత్ హాల్లో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఏవో ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మానస, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. మునగపాక దళితవాడలో సర్పంచ్ దిమ్మల అప్పారావు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రాజాన బుజ్జిబాబు, బీలా అప్పలనాయుడు, దిమ్మల నూకరాజు, బీలా శివ, మంత్రి శేఖర్ పాల్గొన్నారు ఉమ్మలాడలో సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ, ఉప సర్పంచ్ మందా రాము, లంబా శ్రీనివాసరావు, సూరిశెట్టి రాము పాల్గొన్నారు. అరబుపాలెంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లంబా అప్పారావు, మహేష్, సత్తిబాబు, పారునాయుడు, సత్తిబాబు, బాల గణేష్ పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో కూడా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

తిమ్మరాజుపేటలో..

అచ్యుతాపురం (మునగపాక): మండలంలోని తిమ్మరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మారిశెట్టి వెంకటప్పారావు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు అరుణకుమారి, అంగన్‌వాడీ టీచర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం..

నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో సీతారామరాజు నివాళులు అర్పించారు. చినదొడ్డిగల్లు విద్యార్థులు సుప్రీం కోర్టు, ఎర్రకోట, తాజ్‌మహల్, భూస్వరూపాలు, అక్షాంశాలు, రేఖాంశాల నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎంలు రాణిలలిత, కవిత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రతిజ్ఞ..

కోటవురట్ల: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆధ్వర్యంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. జల్లూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, బ్రిటిష్ అధికారుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కె.వెంటకాపురం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, ఏవో వర్మరాజు, గ్రామ కార్యదర్శి వై.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ..

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం పాఠశాలలో పూర్వ విద్యార్థి సమకూర్చిన అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. గ్రామ ఉపసర్పంచ్ మాణిక్యం, ఉపాధ్యాయులు విజయకుమారి, అరుణ, విమలాదేవి, కృష్ణవేణి, దీపిక, కరుణ, శోభారాణి, అప్పలనాయుడు, గారా ప్రకాష్, సూరిబాబు, అనిత తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపురంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. పంచాయతీ కార్యదర్శులు రమేష్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

మాకవరపాలెం : సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేయాలని ఏవో చిరంజీవి రైతులకు సూచించారు. మండలంలోని జి.కోడూరులో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో సాగు చేసేందుకు రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శేషునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


వరద బాధితుల సహాయ నిధికి విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న హనుమంతరావు

అచ్యుతాపురం (మునగపాక): విజయవాడ వరద బాధితుల కోసం సేకరించిన నగదును మంగళవారం చెక్కు రూపంలో సీఎం చంద్రబాబునాయుడుకు రాష్ట్ర సైనిక్ సెల్ కో–కన్వీనర్ అగ్గాల హనుమంతరావు అందజేశారు. అమరావతిలో చంద్రబాబునాయుడును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి రూ.1,03,300 చెక్కును అందజేశారు. మాజీ సైనికులు, సైనికులు, కళాశాలల కరస్పాండెంట్లు, సెక్యూరిటీ టీమ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరుల నుంచి ఈ నగదు సేకరించినట్లు హనుమంతరావు తెలిపారు. మాజీ సైనికులకు ఆస్పత్రి అలాగే జిల్లా సైనికులకు వెల్ఫేర్ కార్యాలయం ఏర్పాటు, విశాఖ జిల్లా సైనిక్ కార్యాలయాన్ని పాత స్థలంలోనే ఉంచాలని చంద్రబాబును కోరినట్లు ఆయన తెలిపారు.

మెట్ట గ్రామాల్లో బంతిపూల సిరులు

- మండలంలో విరివిగా సాగు
- అనకాపల్లి, గాజువాక, విశాఖల్లో అమ్మకాలు
- ప్రస్తుత సీజన్‌లో మంచి డిమాండ్


అమ్మకానికి పూలను సేకరిస్తున్న రైతు

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు బంతిపూల సాగును విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా గొల్లలపాలెం, మెరక రామచంద్రపురం, కె.సంతపాలెం, ఆర్లి, కింతాడ గ్రామాల్లో రైతులు 30 ఎకరాల్లో బంతిపూలను పండిస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు నీటి వసతి ఉన్న పొలాల్లో సాగు చేపడుతున్నారు. ప్రధానంగా కార్తీకమాసం, ధనుర్మాసంతో పాటు శుభకార్యాల సమయాల్లో బంతిపూలకు మంచి డిమాండ్ ఉండనున్నది. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో మాలాధారులైన భక్తులు పూజల్లో బంతిపూలను ఎక్కువగా వినియోగించనున్నారు. దీంతో ప్రస్తుత సమయంలో బంతి పూలకు మంచి డిమాండ్ ఉండడంతో మంచి మద్దతు ధర లభించనున్నట్లు సాగు రైతులు తెలుపుతున్నారు.

ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి

బంతిపూల పంటను సాగు చేసేందుకు ఎకరాకు కనీసం రూ.50వేల వరకూ పెట్టుబడి అవుతుంది. పొలం దుక్కులు చేసి ఎరువులు అందించడంతో పాటు బంతి ఏనారు, గొప్పులు చేసేందుకు పెట్టుబడి అవుతుంది. బంతి పంట సాగు ప్రారంభించిన 20 రోజుల నుంచి పూల దిగుబడి ప్రారంభం అవుతుంది. పూల దిగుబడి మూడు నుంచి నాలుగు నెలల వరకూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. బంతి మొక్కల నుండి ప్రతి మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి పూలను సాగు రైతులు సేకరిస్తున్నారు.

మంచి మద్దతు ధర

ఐదు కిలోల బరువు గల కవర్‌లలో గల బంతి పూలకు రూ.300 నుంచి రూ.400 వరకూ మద్దతు ధర దక్కనున్నది. ఎకరాల పొలంలో నాలుగు నెలల కాలంలో బంతిపంట సాగు ద్వారా పెట్టుబడులు పోను రూ.50 వేల ఆదాయం వస్తుందని సాగు రైతులు పేర్కొంటున్నారు. పండించిన బంతిపూలను పరిసర గ్రామాల్లో ప్రజలు స్థానికంగా పంట పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మిగిలిన పూలను సాగు రైతులు విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో అమ్మకాలను చేసేందుకు తీసుకువెళ్తున్నారు.

ఆయకట్టుకు నీటి కోసం రైతుల పాట్లు

శ్రమదానంతో తాండవ కాలువలో పూడిక తొలగింపు

నాతవరం : వరి పంట చివరి దశలో ఉండడంతో కాపాడుకోవడం కోసం రైతులు శ్రమదానంతో తాండవ కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. తాండవ రిజర్వాయరులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాలువలో పూడిక పేరుకుపోవడంతో శివారు ఆయకట్టుకు నీరు అందడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురియక పోవడంతో పొట్ట దశలో వరి చేనుకు నీరు అవసరం ఉంది. శివారు ఆయకట్టుకు నీరు అందించలేమని అధికారులు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ, అనకాపల్లి రెండు జిల్లాల పరిధిలో నాతవరం, కోటనందూరు మండలాలకు చెందిన 259 మంది రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో తాండవ కాలువలో పూడిక తొలగించుకున్నారు. దీంతో ఆయకట్టు భూములకు ఓ మోస్తరు నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు అంటున్నారు. అనకాపల్లిలో నర్సీపట్నం, కోటవురట్ల, నాతవరం మండలాల పరిధిలో శివారు గ్రామాల రైతులకు నీరు అవసరం ఉందని అంటున్నారు.